ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): మణికొండ షిరిడీ సాయినగర్ సుందర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ... అన్ని రకాల చీరలతోపాటు, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి సారీస్, భగల్పూర్, డిజైన్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెండ్ సారీస్, లెనిన్ సారీస్, కలంకారి సారీస్, బెంగాల్ కాటన్ సారీస్, లేడీ ఫ్యాన్సీ టాప్స్ డిజైన్ బ్లౌజ్, లక్నో, బెనారస్ సారీస్ ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్, జువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు ఇలా మరెన్నో రకాల వస్తువులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించినట్లుగా తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 వరకు ఉంటుందని నిర్వహకులు పేర్కొన్నారు.

20న అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి13: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ఎన్‌డీడీ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో 1-19 ఏండ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఈనెల 20 న నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారులకు, పిల్లలకు, విద్యార్థులకు మోతాదు చొప్పున టాబ్లెట్ పొడిని, మాత్రలను వేయనున్నారు. బాల్యదశలో రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. నిర్ధేశించిన రోజు అనారోగ్యంతో ఉన్న విద్యార్థుల కోసం, పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థుల కోసం ఈనెల 27 న మాప్ అప్ డే నిర్వహించి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు విద్య, వైద్య అధికారులతో జిల్లా యంత్రాంగం ఇటీవల సమావేశాన్ని నిర్వహించింది. యూసుఫ్‌గూడ బస్తీ దవాఖాన పరిధిలోని ప్రాంతాలలో 20 న ఎన్‌డీడీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు.. ఆ రోజు టాబ్లెట్స్ వేసుకోకుండా మిస్ అయిన పిల్లల కోసం 27 న మాప్ అప్ డే చేపట్టి అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు ఎస్‌పీ హెచ్‌ఓ డాక్టర్ రేవతి తెలిపారు.

కారు ఢీ.. మహిళకు గాయాలు

బంజారాహిల్స్: రోడ్డుదాటుతున్న మహిళను కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహాత్మాగాంధీనగర్ బస్తీలో నివాసం ఉంటున్న చింతల రేణుక అనే మహిళ తన తల్లితో కలిసి టోలీచౌకిలో సిమ్ కార్డు కొనుగోలు కోసం వచ్చారు. రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి

వెంగళరావునగర్, ఫిబ్రవరి 13 : పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువకుడు యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కాలేజ్‌లో పనిచేసేటప్పుడు ఆ యువతి (26)తో సరూర్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీపక్ మోహన్ చనువు పెంచుకున్నాడు. గతేడాది అక్టోబర్ 24 న యూసుఫ్‌గూడలోని లార్వెన్ హోటల్స్‌కు ఆమెను తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ యువతిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. గడ్డిఅన్నారంలో నివసించే కాశగోని శ్రావణ్‌కుమార్ జూబ్లీహిల్స్ లోని ఓ పబ్‌కు వెళ్తుండగా..అతడి కారులో గంజాయి ప్యాకెట్లు పెట్టించిన కేసులో ఈ యువతి ఏ-1 నిందితురాలిగా ఉంది. జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఆ కేసులో జైలుకు వెళ్లొచ్చాక కూడా దీపక్ మోహన్ వేధిస్తున్నాడని..ఇదంతా శ్రావణ్‌పై కక్షగట్టి దీపక్ మోహన్ చేయించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రావణ్ కారులో గంజాయి కేసులో తానొక్క దానినే నిందితురాలిగా ఒప్పుకోవాలని..లేదంటే డెటాల్ తాగి చనిపోతానంటూ దీపక్ మోహన్ బెదిరింపులకు గురి చేస్తున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాధిత యువతి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ పాలనలో నీటి సమస్యలు తీర్చాం

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్
- నల్గొండ సభకు తరలిన బీఆర్ఎస్‌శ్రేణులు



సభకు బయలుదేరిన బీఆర్ఎస్ కార్యకర్తలతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 13: కృష్ణానది మీద ప్రాజెక్టులను కృష్ణా రివర్ బోర్డుకు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం 'చలో నల్గొండ' సభకు ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ నాయకత్వంలో నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలు దేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి కష్టాలు తీరిపోయాయని, కృష్ణానదిపై ఆధారపడిన పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాలలో అద్భుతమైన పంటలు పండాయని గుర్తుచేశారు. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో ప్రాజెక్టులు మొత్తం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మామిడి నర్సింగరావు,ఆకుల రాజు, దయ్యాల దాసు, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

శంషాబాద్ నుంచి నల్లగొండ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

సభకు తరలిన శంషాబాద్ నాయకులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులు పరిరక్షణ కోసం నల్లగొండలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగసభకు మంగళవారం శంషాబాద్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే కేంద్రం చేతుల్లో కృష్ణా జలాలను అప్పగించడంపై మండిపడ్డారు. తెలంగాణకు దక్కాల్సిన నీటిని కాకుండా ఇతరులకు అప్పగించే విధంగా అధికారంలోకి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. తరలివెళ్లిన వారిలో రాష్ట్ర నాయకుడు గణేశ్‌గుప్త, మహేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ సతీశ్, నీరటి రాజు, మంచర్ల మోహన్‌రావులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

నల్గొండ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

సభకు తరలిన జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ శ్రేణులు..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి13: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హాజరవుతున్న నల్గొండ సభకు బీఆర్ఎస్ శ్రేణులు కొత్త ఉత్సాహంతో తరలివెళ్లారు. మంగళవారం యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం నుంచి కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు బస్సులలో బయలుదేరి వెళ్లారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ నాయకత్వంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నల్గొండ సభకు తరలివెళ్లారు.

సభకు తరలిన వెంగళరావునగర్ నాయకులు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 13 : కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా కోసం బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్గొండ సభకు వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల వైఖరి వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నల్గొండ సభకు బయలుదేరిన కార్పొరేటర్ దేదీప్య విజయ్

మేధావులు తప్పలను ప్రశ్నించాలి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13: ప్రజాసమస్యలపై స్పందించకపోవడంతో పాటు తప్పులు జరుగుతున్న వ్యవస్థలను ప్రశ్నించని మేధావులు సమాజంలో ఉన్నా లేకున్నా ఒకటే అని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కే.నాగేశ్వర్ అన్నారు. డా.బీఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.బషీరుద్దీన్ 88వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం 'ప్రజామేధావిగా పాత్రికేయుడు' అనే అంశంపై స్మారకోపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ. నాగేశ్వర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, మేధావి వర్గం ప్రభుత్వాలు చేసే తప్పులను ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎప్పటికప్పుడు ప్రశ్నించి గొంతులేని సామాన్య ప్రజల పక్షాన నిలబడాలి అని సూచించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మేధావి వర్గాలు ప్రశ్నించే పరిస్థితి లేదని, ఇది సమాజానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. వైస్ చాన్సలర్ ప్రొ. సీతారామారావు మాట్లాడుతూ.. తెలంగాణ మేధావి వర్గంలో ప్రొ.బషీరుద్దీన్ ఒకరని, అంబేద్కర్ వర్సిటీలో మౌలిక వసతుల ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ.ఏవీఎన్‌ఆర్.రెడ్డి, ప్రొ.ఘంటా చక్రపాణి, ప్రొ.సి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. నాగేశ్వర్

హుండీ చోరీకి యత్నించిన వ్యక్తులపై కేసు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 13: ఆలయంలో హుండీ చోరీకి యత్నించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డు నెం 11లోని ఉదయ్‌నగర్‌లోని శివ వీరాంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తాళాలు పగలగొట్టి ప్రవేశించారు. ఆలయం ఆవరణలోని హుండీ తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో స్థానికులు అప్రమత్తం కావడంతో వారిద్దరూ పారిపోయారు. ఆలయ అధ్యక్షుడు రవికుమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

దళితులు సంఘటిత శక్తిగా ఎదగాలి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి13: రాష్ట్రంలోని దళితులు సంఘటిత శక్తిగా ఎదిగి ప్రభుత్వ పరంగా వచ్చే హక్కులను సాధించుకోవాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి గ్రేటర్ అధ్యక్షుడు ఆరుట్ల రాజ్‌కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామిక, లౌకిక వ్యవస్థకు వ్యతిరేకంగా పాలన చేస్తోందని విమర్శించారు. దళితులు సామాజిక, ఆర్థిక రంగాలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. దళితులపై జరిగే దాడులను నిలువరించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నీరటి మల్లేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలో కార్మికులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నీరటి మల్లేశ్ మాట్లాడుతూ ఈ నెల 16 న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు, కర్షకులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాలలో దేశాన్ని పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించి కార్మికులకు ఉన్న చట్టాలను కాలరాస్తుందన్నారు. విద్యుత్ సవరణ బిల్లులు 2022ను రద్దు చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మడం, ప్రైవేటుకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేవలం కార్పొరేట్ శక్తులకు మాత్రమే మేలు చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో సీఐటీయూ మండల నాయకులు సామెల్, నాగేశ్, రాములు, విజయ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో ఆటోడ్రైవర్లు పాల్గొనాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 13 : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్ల సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న నిర్వహించే ఒక రోజు రవాణా బంద్‌లో ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఉమర్‌ఖాన్, నగర సహాయ కార్యదర్శి ఎస్.కె.లతీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. డ్రైవర్ల భవిష్యత్తుపై ప్రభావం చూపే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేసి, ఆటో మీటర్ రేట్లు పెంచాలని ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పట్టుదలతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

మణికొండ, ఫిబ్రవరి 13: విద్యార్థులు పట్టుదలతో కృషి చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు వక్తలు సూచించారు. గండిపేట్ లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)లో మంగళవారం రీసెంట్ అడ్వాన్ సెస్ ఇన్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెట్స్, ఎంజీఐటీలు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి, మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్, హైదరాబాద్‌లోని ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ విభాగాధిపతి డాక్టర్ ముత్తుకుమార్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కోమల్‌కపూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ సదస్సు ద్వారా స్ఫూర్తి పొంది తమ తమ రంగాలలో పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

థొరాసిక్స్ సర్జన్స్ 54 వ అధ్యక్షుడిగా డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13: వైజ్ఞానిక సహాయంతో గుండె వ్యాధులను మెరుగుపరిచే విధానంపై సరికొత్త అధ్యయనంతో నగరంలోని స్టార్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, కార్డియాక్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియోవ్యాస్కులర్ థొరాసిక్స్ సర్జన్స్ (ఐఏసీటీఎస్) కు 54 వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గతేడాది కోయంబత్తూరులో జరిగిన 69 వ ఐఏసీటీఎస్‌సీఓఎన్ సదస్సులో తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న నలుగురు కార్డియాక్ సర్జన్స్‌లో డాక్టర్ సజ్జా పాల్గొని ఈ అరుదైన ఘనత సాధించారు. టెక్సాస్‌లోని హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందిన ఆయన ఇటీవల జరిగిన సర్జన్స్ 70 వ వార్షిక సమావేశంలో అధ్యక్ష ప్రసంగం చేయడంతో పాటు భారతదేశంలో కరోనరీ సర్జరీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న సొసైటీకి వ్యవస్థాపక అధ్యక్షుడిగా కూడా పనిచేస్తున్నారు.

జేఈఈ మెయిన్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

బండ్లగూడ, ఫిబ్రవరి 13 : రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సర్కిల్ గిరిజన బాలుర విద్యార్థులు జేఈఈ మెయిన్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. మొత్తం 50 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌కు హాజరు కాగా అందులో 40మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను రీజినల్ కోఆర్డినేటర్ పీఎస్ కళ్యాణి అభినందించారు.

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి13: వీరత్వానికి ప్రతీకగా ఛత్రపతి శివాజీ నిలుస్తాడని ఇంగ్లిష్ ట్రైనింగ్ డైరెక్టర్ డాక్టర్ బాల బోయిన సుదర్శన్, సీపీఐ నగర కార్యదర్శి ఛాయదేవి అన్నారు. ఛత్ర పతి శివాజీ మహారాజ్‌ను స్మరించుకుంటూ,ఆయన ఆశయాలు,లక్ష్యాలను సాధిద్దాం అనే అంశంపై మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సదస్సు నిర్వహించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి స్టాలిన్, నాయకులు నళిని, ఎన్. శ్రీకాంత్, శ్రీనివాస్, మహమూద్,సక్రిబాయి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సురేశ్

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకుడి చేరిక

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ ఉందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మల్కారం సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీశ్ అన్నారు. మంగళవారం మండలంలోని చౌరద్‌గూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముత్యాల సురేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమే కాకుండా బీఆర్ఎస్ పార్టీపై కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, జంగారావు,మంచలం నరేశ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి13: జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు బాల మల్లేశ్, వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను విజయ వంతం చేయాలని ప్రజలకు వారు పిలుపు నిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో బీకే ఎంయూ, ఏఐఎడబ్ల్యూయూ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 80 కోట్లమంది ప్రజలకు దారిద్రరేఖకు దిగువన ఉన్నారని,వారి జీవనప్రమాణాలను పెంచడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహి స్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించి 200 రోజులకు పని దినాలను పెంచి రూ.800 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాములుగౌడ్, బాబు రావు, శంకర్, శ్రావణ్‌కుమార్, అంజయ్య, జంగయ్య, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఘన సన్మానం

మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌ను జ్ఞాపికతో సన్మానిస్తున్న చైర్మన్ నరేందర్ ముదిరాజ్, కౌన్సిలర్లు

మణికొండ, ఫిబ్రవరి 13 : మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌ను మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది మంగళవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ మూడేండ్లుగా మున్సిపల్ కమిషనర్‌గా అనేక అభివృద్ధి పనులు చేపట్టారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగి కమిషనర్లకు వీడ్కోలు

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలలో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న కమిషనర్లను బదిలీ చేస్తూ, వీరి స్థానంలో కొత్త వారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రదీప్‌కుమార్‌ను మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా, కొడంగల్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఫల్గుణ్‌కుమార్‌ను టీయూఎఫ్ఐడీసీ ఏవోగా బదిలీ చేయగా, నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు కమిషనర్లు ఫల్గుణ్‌కుమార్, సురేందర్‌రెడ్డిలను ఆయా మున్సిపాలిటీలల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు వీడ్కోలు పలికారు.

కిరాయి ఇవ్వరు.. ఖాళీ చేయరు..

వెంగళరావునగర్, ఫిబ్రవరి 13 : అద్దె తీసుకున్న భవనానికి కిరాయి చెల్లించకపోగా.. రెంటల్ అగ్రిమెంట్‌ను పొడిగించాలని..లేదంటే అంతు చూస్తామని ఓ వృద్ధురాలిపై మహిళ బెదిరింపులకు పాల్పడింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన సూరం రమణమ్మ అమీర్‌పేట్ వెస్ట్ శ్రీనివాసనగర్ కాలనీలో జీ ప్లస్ 5 అంతస్తుల భవనం ఉంది. ఈ భవనాన్ని లేడీస్ హాస్టల్‌ను నిర్వహించుకునేందుకు 2021 అక్టోబర్ 1న రమాతులసి అద్దెకు తీసుకుంది. కొన్నాళ్ల తర్వాత అద్దె చెల్లించడం మానేసింది. బిల్డింగ్ ఖాళీ చేయకుండా ఉండేందుకు సిటీ సివిల్ కోర్టులో స్టేటస్ కో ఆర్డర్ తెచ్చుకుంది. గత ఫిబ్రవరి 7న ఆ స్టేటస్ కో ఆర్డర్‌ను కోర్టు రద్దు చేసింది. దీంతో రమణమ్మను రామతులసి బెదిరింపులకు గురి చేస్తోంది. రెంటల్ అగ్రిమెంట్‌ను పొడిగించాలని..లేకుంటే నీ పిల్లలపై కేసులు వేసి అమెరికా వెళ్లకుండా అడ్డుకుంటానని బెదిరిస్తోంది. ఈనెల 11న వెస్ట్ శ్రీనివాసనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో అసోసియేషన్ సమావేశానికి హాజరయ్యేందుకు నడుచుకుంటూ వెళ్తుంటే ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రమణమ్మ కాలు విరిగింది. కాగా రమాతులసితో పాటు శిరీష అనే మహిళ వచ్చింది. తాను తమ్మినేని ఉదయభాను మరదలినని..వరంగల్ డీఐజీ కోడలినని..పత్రాలపై సంతకాలు చేయకుంటే అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నంది అవార్డుకు గద్దర్ పేరును స్వాగతిస్తున్నాం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 13 : నంది అవార్డుకు గద్దర్ నామకరణం చేయడం స్వాగతిస్తున్నామని, ఆ ప్రజాగాయకుడి చరిత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని వక్తలు అన్నారు. 'గద్దర్ అవార్డ్-సినీ ఇండస్ట్రీ ఔట్ లుక్' అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ల